# హైలీపై హేపీ జర్నీ

అది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ రీసెర్చ్ కార్యాలయం. దాని డైరక్టర్ రవి ఆస్ట్రనామికల్ చార్ట్ ముందువేసుకుని తీవ్రంగా ఏదో ఆలోచిస్తున్నాడు. ఆయన అంతకుముందు ఎన్నో అంతరిక్ష నౌకలలోనూ, స్పేస్ షటిల్స్‌లోనూ విజయవంతంగా ప్రయాణం చేసివచ్చాడు. ఆయనకున్న పరిజ్ఞానం, అనుభవం దృష్ట్యా అచిరకాలంలోనే ఆయనకి ఆ ఇన్‌స్టిట్యూట్ డైరక్టర్ పదవి లభించింది. ఆయన పర్యవేక్షణలో ఆ సంస్థ అంతరిక్షానికి, గ్రహాంతరాయానానికి సంబంధించిన ఎన్నో పరిశోధనలు విజయవంతంగా నిర్వహించింది. ప్రపంచంలోని అటువంటి సంస్థలలో ఒక ప్రముఖస్థానం ఆక్రమించింది. రానున్న ఐదేళ్ళలో అంగారక గ్రహానికి మనుష్యులని పంపడానికి ఒక పథకాన్ని కూడా రూపొందించాడు ఆయన. ప్రభుత్వం అందుకు ఆమోదం తెలిపి ప్రాథమిక అవసరాలకు కావలసిన నిధులను కూడా సమకూర్చింది. ఆ యాత్రలో రవి అతని అనుచరుడు కిషోర్ ఉంటారనేది బహిరంగ రహస్యమే. వారిద్దరూ సహ అంతరిక్ష యాత్రికులే కాకుండా సన్నిహితమిత్రులు కూడా.

కిషోర్ ఆ గదిలోకి ప్రవేశించాడు. రవి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కనిపించడంతో మౌనంగా నిలబడిపోయాడు.

అతని రాకను గ్రహించి తల ప్రక్కకు త్రిప్పి "రా... కూర్చో" అన్నాడు రవి.

కిశోర్ అతని ప్రక్కనే కూర్చుంటూ "ఏమిటి తీవ్రంగా ఆలోచిస్తున్నావు?" అని అడిగాడు.

"ఏంలేదు. ఈ సంవత్సరం చివరలో హాలీస్ కామెట్ భూమిని సమీపిస్తున్న విషయం నీకు తెలిసిందే కదా?" అన్నాడు రవి.

"అవును. 76 సంవత్సరాలకు ఒకసారి వస్తూ ఆకాశంలో అత్యంత అందాలను వెదజల్లే తోకచుక్క అది. దానిని చూడాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతున్నాను" అన్నాడు కిశోర్.

"ఈ సారి ఇందులో ఒక ప్రత్యేకత వుంది. ఈ పర్యాయం ఈ తోకచుక్క భూమికి కేవలం ఏడులక్షల కిలోమీటర్ల దూరంలోకి వస్తోంది. అందువల్ల ఈ అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలని



అనుకుంటున్నాను" అన్నాడు రవి.

"ఎలా?" అని అడిగాడు కిశోర్ ఆసక్తితో.

"తోకచుక్కలు మన సౌరకుటుంబంలోని చిట్టచివరి ప్లూటో గ్రహానికి అవల వున్న విషయం తెలిసిందే కదా. ఈ తోకచుక్కలు సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నప్పుడు గ్రహాల్ని సమీపిస్తుంటాయి. ఈ తోకచుక్క మీదికి మనం అంతరిక్ష నౌకలో దిగామనుకో. ఆ తోకచుక్కతో పాటు మనం సౌరమండలం మొత్తాన్ని చుట్టిరావచ్చు. కొద్ది లక్షల కిలోమీటర్ల దూరంనుంచి మన అత్యంత శక్తిమంతమైన టెలిస్కోప్‌ల ద్వారా గ్రహాల్ని వాటి ఉపగ్రహాల్ని పరిశోధించవచ్చు" అన్నాడు రవి.

"నీ ఆలోచన అద్భుతంగావుంది. కానీ ఈ హేలీ తోకచుక్క తిరిగి భూమిని సమీపించడానికి డెబ్భైఆరేళ్ళు పడ్తుందే! అంతకాలం మనం అంతరిక్షయానం చేస్తుండగలమా?" అన్నాడు కిశోర్ సందేహం వ్యక్తం చేస్తూ.

"అలా అని నేను అనడంలేదు. రానున్న ఐదేళ్ళలో మనం అంగారక గ్రహయాత్రకి సన్నాహాలు చేస్తున్నాం కదా! భూమి తర్వాత ఈ తోకచుక్క సమీపించేది అంగారక గ్రహాన్నే. అది అంగారక గ్రహాన్ని సమీపించేసరికి దాని ఉపగ్రహమైన ఫోబాస్ మీద దిగుదాం. హేలీ కామెట్ ఆకర్షణశక్తి చాలా తక్కువ కనుక దానిపైనుంచి తక్కువ ఇంధనాన్ని ఉపయోగించి అంతరిక్షంలోకి ఎగిరి రెట్రోరాకెట్ల ద్వారా ఫోబాస్ మీదకి సాఫ్ట్‌లాండింగ్ చేయవచ్చు. అక్కడినుంచి అంగారక గ్రహాన్ని నిశితంగా పరిశీలించి

కావాలనుకున్నప్పుడు తిరిగి భూమికి వచ్చేయవచ్చు." అన్నాడు రవి.

"ఎలా?" అని సందేహం వ్యక్తం చేశాడు కిశోర్.

"ఫోబాస్ అతిచిన్న ఉపగ్రహం. దాని వ్యాసం కేవలం 25 కిలోమీటర్లు. అందువల్ల దానిమీద నుంచి కూడా అతి తక్కువ ఇంధనాన్ని ఉపయోగించి అంతరిక్షంలోకి ఎగిరి భూమికి తిరిగి రాగలదు మన నౌక" అని వివరించాడు రవి.

"ఆలోచన అయితే బాగానేవుంది కానీ మన యాత్ర పూర్తి అవడానికి ఎన్నోనెలలు, బహుశా ఏడాదిపైగా పట్టవచ్చు. అంతకాలం మనకి కావలసిన ఆహారం, నీరు వెంట తీసుకెళ్ళడం సాధ్యమా?" అన్నాడు కిశోర్.

"ఈ విషయంలో కూడా హేలీ కామెట్ మనకి ఎంతగానో ఉపయోగపడగలదు అనే నా నమ్మకం' ' అన్నాడు రవి.

"ఎలా?" అని అడిగాడు కిశోర్ కుతూహలంతో.

"తోకచుక్కలలో ఉండేదేమిటి?" అని ప్రశ్నించాడు రవి.

శాస్త్రజ్ఞులకి తెలిసిందే కదా. పైన తలభాగం గట్టి పదార్థంతో ఉండి చుట్టూ వాయువులు ఉంటాయి. సూర్యుని అది సమీపించినప్పుడు గడ్డకట్టిన వాయువులు కరిగి తోకగా ఏర్పడుతాయి" అన్నాడు కిశోర్.

"ఆ విషయం కాదు నేనడుగుతోంది. తలభాగం దేంతో తయారయింది" అన్నాడు రవి.

"తలలో మట్టి, ధూళి, పెద్దపెద్ద రాళ్ళు, గడ్డకట్టిన స్థితిలో నీరు, అమోనియా, మిథేన్ వంటి వాయువులు వుంటాయి." అన్నాడు రవి.

"అవునా. అక్కడ నీరు ఉంది కనుక దానిని మనం ఉపయోగించుకోవచ్చు. అలాగే నత్రజని కలిగిన అమోనియా, మిథేన్ కార్బన్ కాంపౌండ్స్ వున్నాయి కనుక, తగిన కల్చర్‌మీడియంను సృష్టించి మనం అక్కడ ఆల్గేలైచెన్ వంటి ప్రాథమిక వృక్షజాలాన్ని పెంచవచ్చునని నా విశ్వాసం. ఆల్గేని లైచెన్‌ని ఆహారంగా తీసుకోవచ్చునని నీకు తెలుసుగా. ఇదిగాక భూమినుంచి మనకి సరిపడా ప్రత్యేకమైన ఆహారాన్ని, నీటిని తెచ్చుకోవచ్చు" అన్నాడు రవి.

" అంటే నీ ఆలోచన ప్రకారం భూమినుంచి మనం బయటపడగలిగి హేలీతోకచుక్క మీద వాలగలిగితే దానినే మన అంతరిక్ష నౌకలాగా ఉపయోగించుకుని మన ఇంధనం ఖర్చుకాకుండా అంగారక గ్రహ సమీపానికి యాత్ర చేసి రావచ్చునన్న మాట" అన్నాడు కిశోర్.

"సరిగ్గా చెప్పావు. అదే నా ఆలోచన. ఆలోచనే కాదు. ఇది ఆచరణసాధ్యం అని నా నమ్మకం అన్నాడు రవి.

"బాగుంది. నీ ఆలోచన అద్భుతంగా వుంది. ఈ లెక్కన మనం మరొక పనికూడా చేయవచ్చు" అన్నాడు కిశోర్ ఆలోచనగా.

"ఏమిటది?" అని అడిగాడు రవి ఉత్సాహంగా.

"తోకచుక్కల ఆవిర్భావం గురించి శాస్త్రజ్ఞులలో విభిన్న అభిప్రాయాలు వున్నాయి. కొందరు అవి

అసలు మన సౌరమండలానికి చెందినవి కావని భావిస్తే ఇంకొందరు అవి సౌరమండలంలో సూర్యుడు, గ్రహాలు, ఉపగ్రహాలు ఏర్పడగా మిగిలిన దుమ్ము, ధూళిలతో ఏర్పడ్డాయని ఊహిస్తున్నారు. మరికొందరు అంగారక గురు గ్రహాల మధ్య ఒకప్పుడు ఉండి ముక్కలయిపోయిన ఒక పెద్ద గ్రహంలోని ముక్కలని విశ్వసిస్తున్నారు. మనం హేలీ తోచకుక్క మీద దిగి ప్రత్యక్షంగా పరిశోధించడంవల్ల తోకచుక్కల రహస్యం సరిగా అవగతం చేసుకోగలం. కొన్ని నెలలపాటు మనం ఈ తోకచుక్క మీదనే ఉంటాం కనుక అవసరమైన పరిశోధనలను సమగ్రంగా చేసుకోవడనానికి వీలవుతుందని నా నమ్మకం" అన్నాడు కిశోర్.

"శహబాష్... నా ఆలోచనే నీకూ వచ్చింది. అంగారక గ్రహ పరిశోధన నా ప్రధాన లక్ష్యం కనుక ముందుగా ఆ విషయాన్నే చెప్పాను. ఒక్క దెబ్బకి రెండు పిట్టలన్నట్లు ఈ యాత్ర మూలంగా మనం తోకచుక్కనీ, అంగారక గ్రహాన్ని కూడా పరిశోధించగలం" అన్నాడు రవి.

"నాకు మరో ఆలోచనకూడా వస్తోంది" అన్నాడు కిశోర్.

"ఏమిటది?" అని అత్యంత ఉత్సాహంగా అడిగాడు రవి.

"మనదేశం ఎలాగూ వచ్చే ఐదేళ్ళలో మానవుల్ని అంగారక గ్రహంమీద దింపడానికి సన్నాహాలు చేస్తోంది కదా. అలాంటప్పుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హెలీ కామెట్ మీదనుంచి ఏకంగా అంగారకుని మీదనే దిగవచ్చుగా. అంటే ఈ తోకచుక్క అంగారకునికి అతి సమీపంగా రాగానే టేక్ ఆఫ్ చేసి అంగారకుని మీద సాఫ్ట్ లాండింగ్ చేయవచ్చుగా. మధ్యలో ఫోబాస్ మీద దిగడం ఎందుకు?" అన్నాడు కిశోర్.

రవి ఒక్కక్షణం ఆలోచించాడు. "నువ్వు చెప్పింది వాస్తవమే. కానీ ఫోబాస్ మీద దిగాలనుకోడానికి కారణాలు లేకపోలేదు" అన్నాడు.

"అపోలో-II" చంద్రుడిమీద దిగడానికి ముందు అమెరికా అంతరిక్ష నౌకలని చంద్రుని సమీపానికి పంపి చంద్రునిపై దిగగల స్థానాలను సర్వేచేసింది. అలాగే అంగారకుని మీద దిగగల ప్రాంతాలను గుర్తించడానికి కూడా ఇటువంటి సర్వే ఎంతైనా అవసరం. ఇందుకు ఫోబాస్ ఎంతైనా అనుకూలంగా ఉంటుంది. ఇది అంగారకుని నుంచి కేవలం 5825 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అంగారక గ్రహాన్ని 7 గంటల 37 నిముషాలలో చుట్టివస్తుంటుంది. అందువల్ల అక్కడినుంచి అంగారక గ్రహం మొత్తాన్ని సర్వే చేయడం చాలా సులువు అవుతుంది" అన్నాడు రవి.

"ఆగాగు. అమెరికా 1976లో వైకింగ్ నౌకలను అంగారకుని మీద దింపింది కదా. అంటే అవి సర్వేచేసిన ప్రదేశాలే కదా. అక్కడే మనం దిగవచ్చుకదా?" అన్నాడు కిశోర్.

"అందుకే అక్కడ కాక వేరెక్కడైనా దిగాలని భావిస్తున్నాను నేను" అన్నాడు రవి.

"అదేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాడు కిశోర్.

"అవును. వైకింగ్‌లు దిగిన ప్రాంతంలో ఎటువంటి జీవమూలేదని అవి పంపిన సమాచారం ద్వారా తెలిసింది. మళ్ళీ అక్కడే దిగి పరిశోధించాల్సిన అవసరం ఏముంది? అంగారకుని మీద జీవం మనుగడకు అవసరమైన పరిస్థితులు ఉన్నాయి. అందువల్ల భూమిలో సగంకంటే పెద్దగ్రహమైన అంగారకునిలో ఏవో కొన్ని ప్రాంతాలలోనైనా ఏదో రకమైన జీవం ఉండితీరుతుందని ఎందరో శాస్త్రజ్ఞులు

భావిస్తున్నారు. సహారా ఎడారిలో ఓ చోటదిగి ఆ మందు ఇసుకలో ఏ విధమైన మొక్కలుకాని, పురుగులుకాని కనిపించకపోతే దానిని బట్టి భూమిమీద జీవం లేదని పరలోకవాసులు భావిస్తే ఎంత పొరపాటో అలాగే వైకింగ్‌లు దిగిన ప్రదేశం ఆధారంగా అంగారకుని మీద జీవంలేదని భావించడం అంతే పొరపాటని వీరు వాదిస్తున్నారు. ఒకసారి మనం అంగారకుని మీద దిగామంటే మనం పరిశోధించగలిగింది చాలా తక్కువ ప్రాంతమే. కనుక ఫోబాస్ నుంచి పరిశోధిస్తే మొత్తం గ్రహాన్ని సమగ్రంగా చూడవచ్చు. అనువైన ప్రాంతాలు అనేకమైన వాటిని గుర్తించవచ్చు" అన్నాడు రవి ఒక్కబిగిన-

"నువ్వు చెప్పింది నిజం. నేనంత దూరం ఆలోచించలేదు" అన్నాడు కిశోర్.

"అంతేకాదు. భూమివంటి పెద్ద గ్రహం పైనుంచి అంతరిక్షంలోకి దూసుకుపోవాలంటే ఎంతో ఇంధనం ఖర్చు అవుతుంది. అలాగే ఒక పెద్ద గ్రహమైన అంగారకుని మీద నుంచి కూడా తిరిగి అంతరిక్షంలోకి వెళ్ళాలంటే ఇందులో సగంపైనే ఇంధనం ఖర్చవుతుంది. ఇంత పెద్ద ప్రయోగం చేయాలంటే కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. అందువల్ల అంగారకుని నుంచి ఎగిరే ప్రసక్తిలేకుండా ఫోబాస్ మీదనుంచే ఆ గ్రహాన్ని పరిశోధిస్తే ఆ తర్వాత నెలలతరబడి అంగారకుని మీద మకాం పెట్టి ఎంతో ప్రయోజనాత్మకమైన పరిశోధనలను చేయడానికి అవకాశం కలుగుతుంది. ఇప్పుడైతే కేవలం భూమినుంచి టేక్ ఆఫ్‌కి అయ్యే ఖర్చు మాత్రమే ప్రధానమైనది అవుతుంది" అన్నాడు రవి.

"ఓ.కె! మరైతే మన అంతరిక్ష యాత్రకి ముహూర్తమే తరువాయి అన్నమాట" అన్నాడు కిశోర్.

"అవును. దీనికోసం సమగ్రమైన ప్రపోజల్‌ను ప్రభుత్వానికి పంపుతాను. వారి ఆమోదం రాగానే తర్వాత కార్యక్రమం మొదలవుతుంది" అన్నాడురవి.

అప్పటికి ఆ ప్రస్తావన ముగిసింది.

* * * *

రవి పంపిన ప్రపోజల్‌కి ప్రభుత్వ ఆమోదం త్వరలోనే లభించింది. అందుకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం కేటాయించింది. వినూత్నమైన ఈ ఆలోచన ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

శ్రీహరికోట షార్ సెంటర్లో రాకెట్ సిద్ధమవుతోంది. అదే రవి, కిశోర్‌లను అంతరిక్షంలోకి తీసుకుపోయి హైలీకామెట్ మీద దింపుతుంది. మరికొన్ని విభాగాలు అంతరిక్ష యాత్రలో వారికి కావలసిన ఆహారం, నీరు, దుస్తులు ఇతర అవసరాలను అమర్చడంలో నిమగ్నమై ఉన్నాయి.

అర్ధసంవత్సరం గడిచిపోయింది. ఇంక నాలుగు రోజుల్లో ఫిబ్రవరి నెల వస్తుంది.

ఆ నెలలోనే హైలీస్ కామెట్ భూమికి అతిచేరువగా వస్తుంది.

ఫిబ్రవరి రాగానే రాత్రిపూట ఆకాశంలో మసకమసకగా చీపురుకట్ట ఆకారం కనిపించసాగింది. రోజురోజుకీ అది మరింత కాంతిమంతం కాసాగింది.

ఫిబ్రవరి 27 వచ్చింది. ఆ రోజు రాత్రి ఆకాశంలో బాణాసంచా కాలుస్తున్నట్టు కాంతులు వెదజల్లసాగింది హైలీకామెట్.

మర్నాడే అది అతి చేరువగా వచ్చేది.

షార్ కేంద్రంలో రాకెట్ సిద్ధంగా ఉంది. ప్రొద్దున 10-30కి బయలుదేరుతుంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఎందరో ప్రముఖులు, దేశవిదేశ శాస్త్రజ్ఞులు, పాత్రికేయులందరూ ఎంతో ఉత్కంఠతో ఆ కార్యక్రమాన్ని గమనిస్తున్నారు.

రవి, కిశోర్ స్పేస్ దుస్తులు ధరించి రాకెట్లోకి ప్రవేశించారు.

కౌంట్ డౌన్ ప్రారంభం అయింది.

10, 9, 8, 7, 6, 5, 4, 3, 2, 1, 0 అంకెలు చూపసాగింది ఎలక్ట్రానిక్ గడియారం. చివరి అంకెరాగానే భూనభోంతరాళాలు దద్దరిల్లే శబ్దంతో దిగువనుంచి బ్రహ్మాండమైన అగ్నిజ్వాల వెలువడుతుండగా రాకెట్ నిలువుగా ఆకాశంలోకి లేచింది. చూస్తుండగానే కొంచె సేపట్లో కనుమరుగైపోయింది. ఫస్టుస్టేజి, సెకెండ్ స్టేజి రాకెట్లు విడిపోయాక రవి, కిశోర్ ఉన్న థర్డు స్టేజి రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది.

* * * *

రాకెట్ బయలుదేరి 27 గంటలు దాటింది. హైలీకామెట్ అంతకంతకీ పెద్దగా అద్భుతంగా వర్ణించడానికి అలవికాని అందంతో అంతరిక్షంలో మెరిసిపోతోంది. దాని కాంతిముందు ఆకాశంలో అంతకుముందు పాదరసం బుడ్లలాగా మెరుస్తుండిన నక్షత్రాలు కనుమరుగయ్యాయి.

రాకెట్ హైలీకామెట్ని బాగా సమీపించింది. సమయానికి రెట్రోరాకెట్ని పేల్చారు. మరికొద్ది నిముషాలలో ఆ తోక చుక్క మీద రాకెట్ సాఫ్టలాండింగ్ చేసింది.

ముందు రాకెట్ కిటికీల్లోంచి నలువైపులా చూశారు. అన్నివైపులా రాళ్ళు, వాటి మధ్య మంచుముద్దలు కనిపిస్తున్నాయి. సూర్యకాంతికి ఆ మంచుగడ్డలు మెరిసిపోతున్నాయి. కొద్దిసేపట్లో వారిద్దరూ నిచ్చెనను బయటికి జరిపి రాకెట్లోంచి బయటకు వచ్చారు. నేల గట్టిగానే ఉంది. వారిద్దరూ ఆ 'తోకచుక్క' మీద కొంతదూరం తిరిగివచ్చారు. తోకచుక్క వ్యాసం చిన్నది కావడంతో ఆకాశం దగ్గర్లోనే నేలని తాకుతున్నట్లు అనిపిస్తోంది. ఆకర్షణశక్తి బాగా తక్కువ కావడంతో ఎంత నెమ్మదిగా నడిచినా గెంతుతున్నట్లుంటోంది. జాగ్రత్తగా తిరిగి కొంత మట్టిని మంచుశిలలను తీసుకుని రాకెట్లోకి వెళ్ళారు.

* * * *

నెలలు గడిచిపోతున్నాయి. తోకచుక్కల్ని భారతీయులు 'ధూమకేతువులు' అంటారు. ఆ ధూమకేతు వాహనం మీద అంతరిక్షంలో రవి, కిశోర్ల అంతర్గ్రహయాత్ర సాగుతోంది. అక్కడి నుంచి వారు ఈ అనంత విశ్వంలోని గ్రహాలను, నక్షత్రాలను, గాలక్సీలను టెలిస్కోపుద్వారా పరిశోధించసాగారు. తోకచుక్కమీద సేకరించిన మట్టిని, శిలలను, మంచుగడ్డలను, వాయువులను రాకెట్లోని లేబరేటరీలో పరిశోధించసాగారు. వాటి ఫలితాలను గమనించి "నా అభిప్రాయం ప్రకారం తోకచుక్కలు అంగారక గురుగ్రహాల మధ్య ఉండిన గ్రహం ప్రేలిపోయినప్పుడు ఏర్పడిన శకలాలు అన్నవాదం నిజమనిపిస్తోంది" అన్నాడు రవి.

మరి కొద్దిరోజులలో హైలీస్ కామెట్ అంగారక గ్రహానికి బాగాచేరువయ్యింది. సరైన సమయంలో అక్కడినుంచి టేక్ ఆఫ్ తీసుకుని ఫోబాస్ ఉపగ్రహం మీద తమ రాకెట్ను దింపారు రవి, కిశోర్లు

ఫోబాస్ పైన గట్టి గ్రానైట్ శిలలు వున్నాయి. నీరు, వాయువులు ఏవీలేవు. ఈ గ్రానైట్ శిలల్ని బట్టి

ఫోబాస్ కూడా ఆ ప్రేలిపోయిన గ్రహంలో భాగమని ఇది అంగారకుని ఆకర్షణ వల్ల ఉపగ్రహంగా మారిందనీ అనిపిస్తోవంది. అంగారకుని రెండో ఉపగ్రహమైన డైమాస్ కూడా ఇట్టిదే అని నా అభిప్రాయం" అన్నాడు రవి.

ఫోబాస్ నుంచి అంగారక గ్రహాన్ని టెలిస్కోప్ ద్వారా మాగ్నెటిక్ సర్వేద్వారా ఇంకెన్నో పద్ధతుల ద్వారా నిశితంగా పరిశీలించారు రవి కిశోర్‌లు. ధ్రువాలమీద పేరుకున్న మంచును చూశారు. హిమాలయాల కంటే మూడురెట్లు అంటే 15 మైళ్ళు ఎత్తున్న నిక్స్ ఒలింపిక్స్ పర్వతాలని చూశారు. 20వేల అడుగుల లోతు, 75 నుండి 150 మైళ్ళ వెడల్పుతో 2300 మైళ్ళ పొడవున్న బ్రహ్మాండమైన లోయను చూశారు. అనేక ఎండిపోయిన నదుల్ని, ఎర్రని మట్టిగుట్టల్ని చూశారు.

"అంగారకుడి వీద ఒకప్పుడు పెద్ద నదులు పారాయని, అగ్ని పర్వతాలు విజృంభించాయని శాస్త్రజ్ఞుల విశ్వాసం. మన పరిశోధనలు ఈ అభిప్రాయాలు వాస్తవమని నిరూపిస్తున్నాయి. బహుశా ఒకప్పుడు జీవం, బుద్ధిజీవులు కూడా ఉండి కాలక్రమేణా అంగారక గ్రహ అంతర్భాగంలోకి వెళ్ళిపోయి ఉండవచ్చు. అంగారక గ్రహం మీదకి దిగినప్పుడు వాటిని అన్వేషించాలి" అన్నాడు కిశోర్.

అంగారక గ్రహంమీద మనుష్యులు దిగగలిగిన ప్రాంతాలను ఎన్నింటినో గుర్తించి తమ పరిశోధనలను పూర్తి చేసుకున్నారు. ఎప్పటికప్పుడు భూమితో సంబంధాలు పెట్టుకున్నారు. తమ లక్ష్యం పూర్తి అయ్యాక ఫోబాస్‌కి, అంగారకునికి వీడ్కోలు చెప్పారు.

ఫోబాస్ మీదనుంచి టేక్ ఆఫ్ చేసిన రాకెట్ భూమివైపు అంతరిక్షంలోకి దూసుకుపోయింది. అనంతవిశ్వంలో అద్భుత యాత్రానుభవాలను నెమరువేసుకుంటూ తాము బయలుదేరిన విషయం భూకేంద్రానికి తెలియజేశారు రవి, కిశోర్‌లు.

**ఆంధ్రభూమి మాసపత్రిక నవంబర్ 1986** ✪